**ప్రత్యేకత**

కోపంతో మాట్లాడితే
గుణాన్ని కోల్పోతారు
అధికంగా మాట్లాడితే
ప్రశాంతతను కోల్పోతారు
అనవసరంగా మాట్లాడితే
అర్థాన్ని కోల్పోతారు
అహంకారంతో మాట్లాడితే
ప్రేమను కోల్పోతారు
అబద్ధాలు మాట్లాడితే
పేరును కోల్పోతారు
ఆలోచించి మాట్లాడితే
ప్రత్యేకతతో జీవిస్తారు.


# DD9 వార్త
తెలుగు దినపత్రిక


'టాక్సిక్' కోసం మేకర్స్ మాస్టర్ ప్లాన్..
## అంచనాలు పెంచే ప్రయత్నం



05

సంపుటి : 02 సంచిక : 236 హైదరాబాద్, ఏప్రిల్, గురువారం 16, 2026 పేజీలు : 06 వెల : 3.00

# మైనింగ్ కొండంత.. ఆదాయం అంతంత

**గనులు, భూగర్భ వనరుల శాఖలో అవకతవకలు**
**అక్రమ మైనింగ్‌పై తీవ్ర ఆరోపణలు**
**పంట పొలాలు, జీవ వైవిధ్యం దెబ్బతినడం**
**తవ్విన ఖనిజ పరిమాణం తక్కువగా చూపించడం**
**GPS ట్రాకింగ్ ద్వారా రవాణా నియంత్రణ**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్రంలో గనులు, భూగర్భ వనరుల శాఖ పరిధిలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లీజుదారులు అనుమతులను మించి తవ్వకాలు సాగిస్తూ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. తమకు కేటాయించిన భూభాగాన్ని దాటి ప్రభుత్వ, అటవీ, ప్రైవేటు భూముల్లో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. తవ్విన పరిమాణాన్ని తక్కువగా చూపుతూ రాయల్టీ ఎగవేతకు పాల్పడుతున్నారు. ఒకే ట్రాన్సిట్ పాస్, వే బిల్లును పదే పదే ఉపయోగిస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన రూ.వేల కోట్ల ఆదాయం పక్కదారి పడుతుండగా.. పర్యావరణం, భూగర్భ జలాలు, పంట పొలాలు, జీవ వైవిధ్యం దెబ్బతింటోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. గ్రానైట్, ఇసుక క్వారీలు అధికంగా ఉన్న ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యవస్థీకృతంగా సాగుతున్న మైనింగ్ దోపిడీలో అక్రమార్కులు, లీజుదారులకు కొందరు మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**సగానికి పడిపోయిన ఆదాయం**
రాష్ట్రంలో బొగ్గు, ఇనుము, సున్నపురాయి, మాంగనీస్ వంటి ప్రధాన ఖనిజాలతో పాటు క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్, ..మిగతా 2లో

# డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కొద్దు

**డీలిమిటేషన్‌పై కేంద్రం ఏకపక్ష ధోరణి సరికాదు**
**ఇండియా కూటమిపై బీజేపీ దుష్ప్రచారం చేస్తోంది**
**ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల ముందు అన్ని పార్టీలతో చర్చలు అవసరం**
**నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్లపై రాజకీయ రగడ**
**డీలిమిటేషన్ నిర్ణయాల్లో కేంద్రం స్వేచ్ఛాయుతంగా వ్యవహరించరాదు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్లపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని, అయితే ఇండియా కూటమి వీటికి వ్యతిరేకమని బీజేపీ దుష్ప్రచారం చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ అంశంలో తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తానంటే కుదరదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై చర్చ ..మిగతా 2లో



# మహిళా రిజర్వేషన్‌కు బీఆర్ఎస్ మద్దతు

**డీలిమిటేషన్‌పై కఠిన వైఖరి**
**కేసీఆర్ కీలక నిర్ణయాలు**
**ఎర్రవెల్లిలో బీఆర్ఎస్ అగ్రనేతల సమావేశం**
**జాతీయ రాజకీయాలపై విస్తృత చర్చలు**
**మహిళా రిజర్వేషన్ బిల్లుకు పూర్తి మద్దతు**
**డీలిమిటేషన్‌పై స్పష్టమైన అభ్యంతరాలు**
**దక్షిణ రాష్ట్రాల హక్కులపై కఠిన హెచ్చరిక**
**తుది నిర్ణయానికి ముందు సమగ్ర పరిశీలన**
**పార్టీ కార్యక్రమాలపై కేసీఆర్ దిశానిర్దేశం**
**పార్టీ ప్లీనరీ ఏర్పాట్లపై విస్తృత చర్చలు**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
జాతీయ రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. బుధవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావులతో సమావేశమైన ఆయన, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే కీలక బిల్లులపై పార్టీ వైఖరిని చర్చించారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై సుదీర్ఘంగా చర్చించి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జాతీయ స్థాయిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై కూడా సమగ్ర చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నిర్ణయాలు భవిష్యత్తులో దేశ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని భావిస్తూ, పార్టీ వ్యూహాన్ని ..మిగతా 2లో

ఇరాన్‌అమెరికా ఉద్రిక్తతలు
# తగ్గుముఖం

**యుద్ధం ముగింపు దశలో ఉందన్న ట్రంప్**
**ఒప్పందానికి ఇరాన్ ఆసక్తి చూపుతోందని వెల్లడి**
**అమెరికా దాడుల ప్రభావంపై కీలక వ్యాఖ్యలు**
**అణ్వాయుధాల అంశంపై తీవ్ర ఆరోపణలు**
**దౌత్య చర్చలకు కొత్త వేదికగా ఇస్లామాబాద్**
**కీలక నేతల పాత్రపై చర్చలు**
**ఇంకా పూర్తిగా తగ్గని సైనిక చర్యలు**
**భవిష్యత్ పరిస్థితులపై అనిశ్చితి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ఇరాన్ మరియు అమెరికా మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు త్వరలోనే తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే ఈ ఘర్షణ ముగింపు దశలో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే పూర్తి స్థాయి శాంతి సాధించాలంటే ఇంకా కొన్ని కీలక చర్చలు జరగాల్సి ఉందని ..మిగతా 2లో



# కాంగ్రెస్ పార్టీలో మళ్లీ పదవుల జోరు

**మీనాక్షి నటరాజన్ తో రేవంత్ రెడ్డి భేటీ**
**కార్పొరేషన్లు, బోర్డులు నియామకాలపై చర్చ**
**పార్టీకి సేవలందించిన వారికి ప్రాధాన్యం**
**సామాజిక సమీకరణాలు, జిల్లాల వారీగా ప్రాధాన్యం**
**పనితీరు ఆధారంగా కొందరి పదవీకాలం పొడిగింపు**
**క్యాడర్ లో ఉత్సాహం నింపేలా చర్యలు తీసుకోనేలా ప్రణాళిక**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ కీలక భేటీ నిర్వహించారు. హైదరాబాద్‌లోని సీఎం అధికారిక నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ అంతర్గత అంశాలు, పరిపాలన సంబంధిత నిర్ణయాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ..మిగతా 2లో

# భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం

**పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా**
**అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని వ్యాఖ్య**
**రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్డీవో ..మిగతా 2లో

# డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

**నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ ఆందోళన**
**కేంద్ర ప్రభుత్వంపై జైరాం రమేష్ తీవ్ర విమర్శలు**
**చిదంబరం హెచ్చరికలు, గణాంకాలతో వివరణ**
**దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యంపై ఆందోళన**
**మాణికం ఠాగూర్ విమర్శలు, రిజిజుకు కౌంటర్**
**కేంద్రం వాదనలు.. అన్యాయం జరగదని హామీ**
**రాష్ట్రాల స్పందన.. ఆల్ పార్టీ మీటింగ్ డిమాండ్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశం మళ్లీ రాజకీయ వేడిని రేపుతోంది. లోక్‌సభ సీట్ల పెంపు, కొత్త పునర్విభజన ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకురానున్న బిల్లులపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఈ ప్రక్రియ దేశ సమాఖ్య వ్యవస్థకు హానికరమని, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం అన్ని రాష్ట్రాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో దేశ రాజకీయాల్లో ఈ అంశం కీలక చర్చగా మారింది. కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేస్తోంది. ముఖ్యంగా ప్రధాని ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ఈ బిల్లులు ఉన్నాయని ఆరోపిస్తోంది. లోక్‌సభలో సీట్ల పెంపు విషయంలో అన్ని రాష్ట్రాలకు సమానంగా అవకాశాలు ..మిగతా 2లో



## మైనింగ్ కొండంత.. ఆదాయం అంతంత

**మొదటిపేజీ తరువాయి**

లాటరైట్, డోలమైట్, బారైట్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్, మార్బుల్, ఎర్త్, రోడ్ మెటల్స్, గ్రావెల్, సాధారణ ఇసుక వంటి మైనర్ మినరల్స్ (చిన్న ఖనిజాలు) కూడా ఉన్నాయి. గనులు, భూగర్భ వనరుల శాఖ లెక్కల ప్రకారం చిన్న ఖనిజాల కేటగిరీలో ప్రస్తుతం 198 మైనింగ్, 1,644 క్వారీ లీజులు ఉన్నాయి. రాష్ట్ర అవతరణ తర్వాత 2022-23లో రాష్ట్ర ఖజానాకు గరిష్టంగా ఖనిజ ఆదాయం రూ.7,705.53 కోట్లు సమకూరింది. ఆ తర్వాత మూడేళ్లుగా ఖనిజాదాయం శరవేగంగా పడిపోతూ రావడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. గనుల శాఖ ప్రతీ ఏటా ఖనిజాదాయాన్ని రాబట్టేందుకు భారీగా లక్ష్యాలు నిర్దేశించుకుంటున్నా ఆశించిన లక్ష్యం చేరుకోక పోవవడం గమనార్హం. అక్రమాల కారణంగానే ఆదాయానికి గండి పడుతోందని తెలిసినా, లీజు హోల్డర్లు, కొందరు రాజకీయ నాయకులు, రెవెన్యూ, పోలీసు అధికారుల మద్దతుతో ఖనిజాదాయానికి గండి పడుతున్నా మైనింగ్ విభాగం నియంత్రించలేక పోతోంది.



**2025–26లో రూ.3,998.51 కోట్లే..!**

2022-23 నాటి ఆదాయంతో పోలిస్తే ఇటీవల ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.3,998.51 కోట్ల ఆదాయం (సుమారు 60%) మాత్రమే వచ్చింది. అంటే మూడేళ్లలో దాదాపు సగానికి రూ.3,707.02 కోట్ల మేర పడిపోయింది. 2023-24లో ఖనిజాదాయంలో ఏకంగా మైనస్ వృద్ధి (-29%) నమోదు కాగా 2024-25లో స్వల్పంగా మెరుగు పడి 1.24 శాతానికి చేరుకున్నా... 2022-23 నాటి ఆదాయం రూ.7,705 కోట్లతో పోలిస్తే -27.5%గా నమోదు అయ్యింది. ఇక ఈ ఏడాది మార్చి నాటికి ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు -40%తో ఖనిజాదాయం వృద్ధి రేటు మరీ క్షీణించింది. ఇదిలావుంటే 2026-27లో గనులు, భూగర్భ వనరుల ద్వారా రూ.7,150 కోట్ల ఆదాయం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకోవడం గమనార్హం.

**ప్రభుత్వ విభాగాల నడుమ సమన్వయ లోపం**

ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నివేదికల ప్రకారం 2025లో క్వారీల్లో 15 చోట్ల తనిఖీలు చేసి 30 లక్షల టన్నుల మేర అదనపు క్వారీయింగ్ జరిగినట్లు గుర్తించి రూ.30 కోట్ల జరిమానా విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ మైనింగ్‌పై గడిచిన ఆరు నెలల్లో 70 మందిపై 18 కేసులు నమోదయ్యాయి. 2,131 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసి పలు వాహనాలు స్వాదీనం చేసుకున్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేమి, ప్రభుత్వ విభాగాల నడుమ సమన్వయ లోపం కూడా అక్రమార్కులకు వరంగా మారుతోందని, అక్రమ క్వారీయింగ్‌ను గుర్తించే లోపే ఖనిజ సంపద పక్కదారి పడుతోందని, ఆదాయానికి గండిపడుతోందని అంటున్నారు.

**అధికారులు, సిబ్బంది లేరంటున్న గనుల శాఖ**

అక్రమ మైనింగ్‌ను అరికట్టి ఆదాయ లక్ష్యాలను సాధించేందుకు సరిపడా అధికారులు, సిబ్బంది తమ విభాగంలో లేరని గనులు, భూగర్భ వనరుల శాఖ చెప్తోంది. అక్రమ మైనింగ్, క్వారీయింగ్, రవాణాను అరికట్టి ఆదాయం సమకూర్చేందుకు సహకరించాల్సిందిగా కోరుతూ 2024 ఫిబ్రవరిలోనే గనుల శాఖ డైరక్టర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు విభాగానికి లేఖ రాయడం గమనార్హం. కాగా దీనిని అడ్డు పెట్టుకుని కొందరు రెవెన్యూ, పోలీసు అధికారులు దందాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలంలో ఒక్కో వాహనంపై ఐదేసి వేల చొప్పున పోలీసు అధికారులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**తరచూ బదిలీలతో..**

గనుల శాఖలో తరచూ జరిగే బదిలీలు విభాగం పనితీరుపై ప్రభావం చూపుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆదాయ లక్ష్యాలను చేరుకోకపోవడం, వివాదాస్పద పనితీరు వంటి కారణాలతో పాటు రాజకీయ ఒత్తిళ్లతో బదిలీలు జరుగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్ వ్యవహారాలు, ఉమ్మడి నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో ఇసుక వెలికితీత, విక్రయాలు, రవాణాలో అక్రమాలు అధికారుల బదిలీల్లో కీలకంగా మారాయని తెలిసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన అధికార పార్టీ నేతలు ఇసుక క్వారీల లీజ్‌ల కోసం చేసిన ఒత్తిళ్ల వల్ల ఒకరిద్దరు టీజీఎండీసీ అధికారులు నిష్క్రమించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.

## మహిళా రిజర్వేషన్‌కు బీఆర్ఎస్ మద్దతు

**మొదటిపేజీ తరువాయి**

ముందుగానే సిద్ధం చేయాలని కేసీఆర్ సూచించారు.మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీఆర్ఎస్ తన స్పష్టమైన మద్దతు ప్రకటించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే ఈ బిల్లుకు తమ పార్టీ పూర్తిగా అనుకూలంగా ఉంటుందని కేసీఆర్ తెలిపారు. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం అవసరమని, ఇది సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో కూడా ఈ అంశంపై తమ పార్టీ చట్టసభలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ఇక నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై మాత్రం కేసీఆర్ కఠిన వైఖరిని ప్రదర్శించారు. ఈ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జనాభా ఆధారంగా సీట్ల పునర్విభజన జరిగితే, జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు నష్టపోతాయని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు ఉన్న ప్రాతినిధ్యం తగ్గకుండా చూడాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో సీట్ల సంఖ్య పెరిగినా, దక్షిణ రాష్ట్రాల వాటా తగ్గకూడదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి రాజీకి కూడా తావు లేదని కేంద్రానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

డీలిమిటేషన్ బిల్లుపై తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలను సవివరంగా పరిశీలించాలని కేసీఆర్ పార్టీ నేతలకు సూచించారు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని, అన్ని కోణాల్లో విశ్లేషణ చేసిన తర్వాతే పార్టీ అధికారిక వైఖరిని ప్రకటించాలని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ అంశాలతో పాటు పార్టీ సంస్థాగత కార్యక్రమాలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. పార్టీ బలోపేతానికి రాబోయే కార్యక్రమాలు కీలకమని భావిస్తూ, వాటిని విజయవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కేసీఆర్ ఆదేశించారు.

ఈ నెలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభపై కూడా ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. జగిత్యాలలో జరిగే ఈ సభను విజయవంతం చేయాలని కేటీఆర్, హరీష్ రావులకు సూచించారు. అలాగే పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశం ద్వారా బీఆర్ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో తీసుకునే నిర్ణయాలపై స్పష్టత వచ్చింది. మహిళా రిజర్వేషన్‌కు మద్దతు తెలుపుతూ, డీలిమిటేషన్ విషయంలో కఠిన వైఖరిని కొనసాగించాలనే నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజుల్లో ఈ అంశాలపై రాజకీయ చర్చలు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కొ-

**మొదటిపేజీ తరువాయి**

జరిగినప్పుడు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తన అభిప్రాయాన్ని వెల్లడించారని చామల గుర్తు చేశారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించి, అందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని ఖర్గే సూచించారని తెలిపారు.



**దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం..**

2023లో మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టినప్పుడు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని, అయితే వీటి అమలుపై జరిగే చర్చల్లో అన్ని రాజకీయ పక్షాలను భాగస్వామ్యం చేయాలని ఎంపీ చామల డిమాండ్ చేశారు. "ప్రస్తుతం ఉన్న 543 సీట్లకు మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ, కేవలం జనాభా ప్రాతిపదికన (ప్రోరేటా ప్రకారం) డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఇప్పటికే నిధుల పంపిణీ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతున్నాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన..**

సీట్ల పెంపుదల విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కీలక ప్రతిపాదన చేశారని చామల తెలిపారు. జనాభా ప్రాతిపదికన 50 శాతం, రాష్ట్రాల ఆర్థిక అభివృద్ధి ఆధారంగా మిగిలిన 50 శాతం సీట్లు పెంచాలని రేవంత్ సూచించారని, దీనిపై ఇప్పటికే ఆయన ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు కూడా రాశారని పేర్కొన్నారు. కేంద్రం ప్రతిపాదించిన 850 సీట్ల పెంపుదలపై గందరగోళం నెలకొందని, పార్లమెంట్‌లో బలం ఉందని ప్రతిపక్షాలను 'బుల్డోజ్' చేసే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. 2026 జనగణనను పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనే విషయంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని, కాంగ్రెస్ ఎన్నడూ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు.

## డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

**మొదటిపేజీ తరువాయి**

కల్పిస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ అంశం చాలా సున్నితమైనదని, ప్రజాస్వామ్య వ్యవస్థపై దీని ప్రభావం గణనీయంగా ఉంటుందని వారు అంటున్నారు.కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ విషయంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం ప్రభుత్వానికి అలవాటైందని, నిజం చెప్పే ధైర్యం లేదని ఆరోపించారు. పునర్విభజన ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం పెద్ద సమస్యగా మారిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటిస్తున్న విషయాలు మరియు వాస్తవ పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, కేంద్రం ఆ దిశగా పనిచేయడం లేదని ఆయన విమర్శించారు.

రాజ్యసభ సభ్యుడు పి. చిదంబరం కూడా ఈ అంశంపై గణాంకాలతో కూడిన విశ్లేషణ ఇచ్చారు. లోక్‌సభ సీట్ల సంఖ్య పెరిగినా, దాని లాభం అన్ని రాష్ట్రాలకు సమానంగా దక్కదని ఆయన వివరించారు. జనాభా ఆధారంగా జరిగే ఈ ప్రక్రియలో పెద్ద రాష్ట్రాలకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పైకి చూస్తే సీట్లు పెరిగినట్లు కనిపించినా, పునర్విభజన తర్వాత వాటి సంఖ్య తగ్గిపోతుందని ఆయన వివరించారు.దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందన్న అంశం ప్రస్తుతం ప్రధాన చర్చగా మారింది. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు నష్టపోతున్నాయని నాయకులు అంటున్నారు. అభివృద్ధిలో ముందున్న ప్రాంతాలకు శిక్ష విధిస్తున్నట్టుగా ఈ విధానం ఉందని విమర్శలు వస్తున్నాయి. మరోవైపు పెద్ద జనాభా ఉన్న రాష్ట్రాలకు అధిక ప్రాతినిధ్యం లభించడం సమాఖ్య సమతుల్యతను దెబ్బతీస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ కూడా ఈ అంశంపై తీవ్రంగా స్పందించారు. లోక్‌సభ సీట్ల పెంపును వివక్ష చర్యగా అభివర్ణించారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణ రాష్ట్రాలకు లాభం జరుగుతుందని చెప్పడం వాస్తవానికి విరుద్ధమని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఆపాలని ఆయన సూచించారు. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.ఇక కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియలో ఎలాంటి అన్యాయం జరగదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జనాభా ఆధారంగా సీట్ల పెంపు జరుగుతుందని, అందులో దక్షిణాది రాష్ట్రాలు కూడా లాభపడతాయని ఆయన పేర్కొన్నారు. భయాలు, అపోహలు వ్యాప్తి చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.


ఈ వివాదంపై రాష్ట్రాల స్పందన కూడా గట్టిగానే ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి ప్రధానికి లేఖ రాస్తూ ఆల్ పార్టీ సమావేశం నిర్వహించాలని కోరారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తమిళనాడు ముఖ్యమంత్రి కూడా ఈ అంశంపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైతే ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. పునర్విభజనలో అన్యాయం జరిగితే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు.డీలిమిటేషన్ అంశం కేవలం పరిపాలనా నిర్ణయం కాకుండా రాజకీయంగా కూడా పెద్ద చర్చగా మారింది. కేంద్రం మరియు ప్రతిపక్షాల మధ్య ఈ వివాదం ఇంకా ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమాఖ్య వ్యవస్థలో సమతుల్యతను కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని అన్ని వర్గాల నుంచి డిమాండ్ పెరుగుతోంది.



## కాంగ్రెస్ పార్టీలో మళ్లీ పదవుల జోరు

**మొదటిపేజీ తరువాయి**

నామినేటెడ్ పదవుల భర్తీ అంశం ఈ సమావేశంలో ప్రధాన అజెండాగా నిలిచినట్లు తెలిసింది. కార్పొరేషన్లు, బోర్డులు, ట్రస్టులు వంటి పలు సంస్థల్లో పదవులు ఖాళీగా ఉండటంతో వాటిని త్వరితగతిన భర్తీ చేయాల్సిన అవసరంపై చర్చించారు. పార్టీకి సేవలందించిన నేతలు, సామాజిక సమీకరణలు, ప్రాంతీయ సమతౌల్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ నియామకాలు చేపట్టాలని భావిస్తున్నట్లు సమాచారం.



**కార్పొరేషన్ ఛైర్మన్ల పదవీకాలం పొడిగింపు**

పదవీకాలం ముగిసిన కార్పొరేషన్ ఛైర్మన్ల రీన్యువల్ అంశం కూడా చర్చకు వచ్చింది. ఇప్పటికే పనితీరు ఆధారంగా కొందరి పదవీకాలాన్ని పొడిగించాలా? లేక కొత్తవారికి అవకాశం కల్పించాలా? అనే అంశంపై అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరవేయడంలో ఈ సంస్థల పాత్ర కీలకమని భావిస్తున్న నేపథ్యంలో సరైన నిర్ణయం తీసుకోవాలని నాయకత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. సీనియర్ నేత జీవన్ రెడ్డి పార్టీ మార్పు అంశం కూడా ఈ భేటీలో ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన తీసుకున్న నిర్ణయం పార్టీపై చూపే ప్రభావం, ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో ఏర్పడుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించారు. స్థానిక స్థాయిలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, కేడర్‌లో ఉత్సాహం నింపే వ్యూహాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.

**విపక్షాల విమర్శలపై సమీక్ష**

ఇటీవల మంత్రులు, ప్రభుత్వంపై విపక్షాలు చేస్తున్న విమర్శలు, ఆరోపణలను ఈ సమావేశంలో సమీక్షించారు. ముఖ్యంగా పరిపాలన, సంక్షేమ పథకాలు, ఆర్థిక పరిస్థితులపై వస్తున్న విమర్శలకు ఎలా ప్రతిస్పందించాలి? అనే అంశంపై వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, సమాచారాన్ని సమర్థంగా చేరవేయడంపై కూడా చర్చించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాలపై పార్టీతో సమన్వయం పెంచాల్సిన అవసరాన్ని ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ప్రస్తావించినట్లు సమాచారం. ప్రభుత్వ నిర్ణయాలు, పార్టీ ఆలోచనలు ఒకే దిశలో ముందుకు సాగితేనే రాజకీయంగా బలం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతల మధ్య సమన్వయం బలోపేతంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**భవిష్యత్ వ్యూహాలపై చర్చ**

రాబోయే రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన వ్యూహాలపై కూడా ఈ భేటీలో చర్చించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, ప్రజా సమస్యలపై చురుకుగా స్పందించడం వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం సీఎం నివాసంలో ఈ భేటీ కొనసాగుతోంది. మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సమావేశం అనంతరం పార్టీ, ప్రభుత్వ పరంగా కొన్ని ముఖ్యమైన ప్రకటనలు వెలువడే అవకాశమున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ఈ భేటీ కీలకంగా మారింది. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగేందుకు అవసరమైన నిర్ణయాలు ఈ సమావేశంలో రూపుదిద్దుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## ఇరాన్‌అమెరికా ఉద్రిక్తతలు తగ్గుముఖం

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేశారు. ఒక ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ వైఖరిలో మార్పు కనిపిస్తోందని, వారు ఒప్పందానికి ముందుకు రావాలనే ఆసక్తి చూపుతున్నారని చెప్పారు.ఇరాన్ రాజధాని టెహ్రాన్ నుంచి వస్తున్న సంకేతాలు కూడా చర్చలకు అనుకూలంగా ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం ఇరాన్ ప్రభుత్వం ఒప్పందానికి సిద్ధంగా ఉందని, తమతో చర్చలు జరపడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాలు యుద్ధం తగ్గుముఖం పడుతున్నదన్న సంకేతాలుగా భావిస్తున్నామని ఆయన అభిప్రాయపడ్డారు.



అమెరికా చేపట్టిన సైనిక చర్యలపై ట్రంప్ విశ్లేషణ కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. తమ దాడులు ఇరాన్‌పై గణనీయమైన ప్రభావం చూపాయని ఆయన అన్నారు. ముఖ్యంగా ఇజ్రాయెల్‌తో కలిసి నిర్వహించిన ఆపరేషన్ల వల్ల ఇరాన్ మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. ఈ దాడుల కారణంగా దేశం తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడానికి చాలా కాలం పట్టవచ్చని ఆయన అంచనా వేశారు. పునర్నిర్మాణానికి దాదాపు రెండు దశాబ్దాలు పట్టే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు.అణ్వాయుధాల అంశంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశంగా మారాయి. అమెరికా జోక్యం లేకపోయి ఉంటే ఇరాన్ ఇప్పటికే అణ్వాయుధ సామర్థ్యం సాధించేదని ఆయన ఆరోపించారు. ఆ పరిస్థితి వస్తే ప్రపంచ రాజకీయాల్లో పెద్ద మార్పు జరిగేదని చెప్పారు. ఒక సందర్భంలో మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ, ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారుతుందో సూచించేలా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ వర్గాల్లో విస్తృతంగా చర్చకు దారితీశాయి.

ఇదే సమయంలో యుద్ధం మధ్య దౌత్య చర్చలు కూడా కొనసాగుతున్నాయి. మొదటి విడత చర్చలు పెద్దగా ఫలితం ఇవ్వకపోయినా, రెండో విడతపై ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయి. ఈ చర్చలకు పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదిక కావచ్చని సమాచారం. అమెరికా తరఫున ఉన్నత స్థాయి ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొనే అవకాశముందని తెలుస్తోంది.ఈ చర్చల్లో కీలక పాత్ర పోషించే నాయకుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలో ఒక బృందం పాల్గొనవచ్చని సమాచారం. అలాగే ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ వంటి నేతలు కూడా చర్చల్లో భాగమయ్యే అవకాశముందని విశ్లేషణలు చెబుతున్నాయి. ఇప్పటికే ఇరాన్ ప్రతినిధులతో కొన్ని రహస్య చర్చలు జరిగినట్లు సమాచారం వెలువడుతోంది. అయితే తదుపరి సమావేశాల తేదీలపై ఇంకా స్పష్టత రాలేదని అమెరికా అధికారులు వెల్లడించారు.

ఇక మరోవైపు యుద్ధం ముగింపు దశలో ఉందని చెప్పినప్పటికీ, అమెరికా ఇంకా తన సైనిక చర్యలను పూర్తిగా నిలిపివేయలేదని ట్రంప్ స్పష్టం చేశారు. పరిస్థితులను బట్టి ముందడుగు వేస్తామని ఆయన తెలిపారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిలో కొనసాగుతున్న నౌకా నిర్బంధం ఇంకా ఉద్రిక్తతలకు కారణమవుతోంది. ఈ చర్యల వల్ల ఇరాన్‌కు చెందిన వాణిజ్య నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఇప్పటికే కొన్ని నౌకలు వెనుదిరిగినట్లు సమాచారం.ఈ ఘర్షణకు నేపథ్యం కూడా కీలకమే. ఫిబ్రవరి చివర్లో అమెరికా మరియు ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై సైనిక చర్యలు ప్రారంభించాయి. ఇరాన్ అణు కార్యక్రమాలపై ఉన్న అనుమానాల నేపథ్యంలో ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా పేర్కొంది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన పలు కీలక మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా అమెరికా ప్రయోజనాలపై దాడులు చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

## భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం

**మొదటిపేజీ తరువాయి**

కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.



# కౌలు రైతులను గుర్తించలేని రాష్ట్ర ప్రభుత్వం.

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్. ఏప్రిల్ 15(డి డి 9 వార్త ):-**



బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన కౌలు రైతులతో మాట్లాడుతూ సాగు చేస్తున్న వివిధ రకాలైన పండించిన పంటలను మార్కెట్ అమ్ముకోలో వారి పేరిట అమ్ముకో లేక నానా ఇబ్బందులు పడుతున్న దృశ్యలను చూస్తున్న క్రమంలో ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం. కౌలు రైతులను గుర్తించి వారికీ 2011 భూ ఆదికృత వాస్తవ సాగుదారుల చట్టాన్ని అమలు చేసి. కౌలు రుణహర్హత కార్డులు ఇచ్చే విదంగా ప్రయత్నం చేయాలనీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న, ఒక ప్రకటనలో తెలియపర్చడం జరిగింది. కౌలు రైతులకు రుణహర్హత కార్డుల వలన భూయజమానికి ఎలాంటి సంబంధం లేకుండానే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తీసుకోవడానికి అవకాశాలు ఉంటాయని, మరియు తాము పండించిన పంట అకాల అతి బారివర్షాలకు పంటలు నష్టపోతే నష్టపరిహారం వచ్చేవిదంగా, తమ పంటలను మార్కెట్లో అమ్ముకునే పెసులుబాటు కల్పించే. విదంగా అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. ఎలాంటి భూమిలేని కౌలు రైతులకి రుణహర్హత కార్డుతో పాటు రైతు భరోసాతో పాటు రైతు భీమా ఉండేవిదంగా చూడవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. కానీ ఆదిలాబాద్ జిల్లాలో దాదాపుగా. 28763 మంది కౌలు రైతులున్నట్లు మా నిర్ధారణలో తేలింది. ప్రతి ఏడాది కూడా కౌలు రైతులే ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకున్నట్లు మా నిర్ధారణ లో తేలింది. మరొక పక్క తాము సాగుచేసే పంటభూమికి కౌలు డబ్బులు మరియు పంట పెట్టుబడికి అయ్యే ఖర్చులు కూడా ప్రయివేట్, వడ్డీ వ్యాపారస్తులనే ఆశ్రహించవలసిన అవసరం ఉందని. అయన అన్నారు. కౌలు రైతులు భీమా రాజు, రాజేందర్, గణేష్, అశోక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి సన్మానం

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఘనంగా సన్మానించింది. బోథ్ గురుకుల కళాశాలలో చదివిన గుడిహత్నూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బడుగు రాజేశ్వరి 1000 మార్కులకు గాను 946 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ప్రోత్సాహం ఎంతో అవసరమని, అది మరిన్ని విజయాలకు దారి తీస్తుందని తెలిపారు. ప్రభుత్వ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రయివేటు కళాశాలలకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధించడం ఆనందదాయకమన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయం ఖాయం అవుతుందని, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు వారికి ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందించాలని సూచించారు. రాజేశ్వరి భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రాజేశ్వరికి శాలువాతో సన్మానం చేసి, సర్టిఫికెట్లను భద్రపరచుకునేందుకు ఫైల్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రాహుల్, సునీల్, దుర్గ ప్రసాద్, వార్డు సభ్యులు కృష్ణ, పెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్లూర్ ఎస్సీ కాలనీలో తీరిన నీటి కష్టాలు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 15(డీడీ9 వార్త):**

కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ గ్రామం ఎస్సీ కాలనీలో గత కొన్నేళ్లుగా నెలకొన్న తీవ్ర తాగునీటి సమస్యకు తెరపడింది. కాలనీలోని రెండు బోరుబావులు పాడైపోవడం, వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారడంతో స్థానికులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని కాలనీ వాసులు గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి తక్షణ పరిష్కారానికి పూనుకున్నారు. సర్పంచ్ ఆదేశాల మేరకు కాలనీలో కొత్తగా బోరు వేయించి, మోటార్ బిగించి నీటి సౌకర్యాన్ని పునరుద్ధరించారు. బుధవారం సర్పంచ్ శైలేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేయడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్యను చెప్పగానే యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించిన సర్పంచ్ శైలేందర్ గారికి, ఉప సర్పంచ్ తక్కురి శేఖర్ గారికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఈ సమస్య పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తూ, బాధ్యతాయుతంగా వ్యవహరించిన వార్డు మెంబర్ దాసరి రాకేష్ కృషిని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాకేష్, సంతోష్, అజయ్, సాదుల్లా, సురేష్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు వన్నెల రాజేశ్వర్, మారుపక నరేష్, సల్మాన్, ఉబేద్, బండి ఆంజనేయులు, సదానంద్, వీరన్న తదితరులు పాల్గొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.



## ఉషోదయ కళాశాల విద్యార్థుల ప్రతిభను అభినందించిన నిజామాబాద్ సీపీ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 15(డీడీ9 వార్త):**

బోధన్ మండల కేంద్రంలోని ఉషోదయ ఇంటర్మీడియట్ మహిళా కళాశాల విద్యార్థినులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, మరియు ఎంఈసి కోర్సులలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య బోధన్ డిగ్రీ కళాశాల వేదికగా ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థినులు సాధించిన ఈ విజయం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో మంచి ఉద్యోగాల్లో స్థిరపడతారని ఆయన హితబోధ చేశారు. తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేసినప్పుడే చదువుకు సార్థకత లభిస్తుందని కమిషనర్ పేర్కొన్నారు. అనంతరం రమాకాంత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో అర్రైవ్ అలైవ్ పేరిట ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవరుచుకోవాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. యువత డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, నేరాల నియంత్రణలో బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ డిగ్రీ కాలేజీ చైర్మన్ ప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్.హెచ్.ఓ వెంకట్ నారాయణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.




## అక్రమ ఇసుక రవాణాపై సీసీఎస్ టీం మెరుపు దాడి

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 15(డీడీ9 వార్త):**

నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సీసీఎస్ ఏసీపీ మస్తాన్ వలీ పర్యవేక్షణలో సీసీఎస్ సిబ్బంది వేల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో దాడులు చేసిన పోలీసులు, రెండు 14 టైర్ల భారీ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వాహనాలతో పాటు ఇద్దరు డ్రైవర్లను మరియు వారి వద్ద ఉన్న రెండు సెల్ ఫోన్లను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చట్టపరమైన విచారణ చర్యల నిమిత్తం స్వాధీనం చేసుకున్న సొత్తును, నిందితులను వేల్పూర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓకు అప్పగించడం జరిగింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే సహించేది లేదని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.




## ఏప్రిల్ 16 నుండి 30 వరకు అమల్లోకి కొత్త నిబంధనలు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 15(డీడీ9 వార్త):**



నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య నగర శాంతిభద్రతలు మరియు ప్రజా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పలు కీలక ఆదేశాలను జారీ చేశారు. ఈ నెల 16 నుండి 30వ తేదీ వరకు అమల్లో ఉండే ఈ నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాలు, పార్కులు మరియు ప్రభుత్వ భవనాల వద్ద విగ్రహాల ప్రతిష్టాపనకు ముందస్తుగా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ అనుమతి తప్పనిసరి. శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.జేల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. నివాస ప్రాంతాల్లో నిర్ణీత డెసిబెల్స్ మించకుండా జాగ్రత్త వహించాలి. ఏదైనా సభలు లేదా 500 మందికి పైగా హాజరయ్యే ఊరేగింపులు నిర్వహించాలనుకుంటే 72 గంటల ముందే కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు, భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్ల వినియోగంపై ఆంక్షలు విధించారు; వీటిని వాడాలంటే సంబంధిత ప్రభుత్వ మరియు ఏవియేషన్ సంస్థల నుండి క్లియరెన్స్ తీసుకోవాలి. గల్ఫ్ ఏజెంట్ల పేరుతో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత ఏజెంట్లకు ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మహిళలు మరియు పిల్లలకు అసౌకర్యం కలిగించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అలాగే, థియేటర్లలో 'ఎ' సర్టిఫికేట్ ఉన్న సినిమాలకు మైనర్లను అనుమతించకూడదని యజమానులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని పోలీస్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని, ప్రజలందరూ పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

## కందుల డబ్బులు రూ. 10 కోట్లు విడుదల..

- **కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి వెల్లడి...**

**ఆదిలాబాద్ జిల్లా. బోథ్, ఏప్రిల్ 15(డి డి 9):-**



ఇటీవల రైతులు మార్క్ ఫెడ్ కు అమ్ముకున్న కందుల పంటకు సంబంధించిన డబ్బులు విడుదల అయినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిది పసుల చంటి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మార్చి 17 వరకు కందులు కొనుగోలు చేయగా వాటికి సంబంధించిన డబ్బులు రూ. 10 కోట్లు విడుదల అయినట్లు తెలిపారు. ఇప్పటికే ఫిబ్రవరి 27వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన 18,194 క్వింటాళ్ల కంది పంటకు సంబంధించిన డబ్బులు రూ. 14.52 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే రూ. 3.5 కోట్ల డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, ఇందులో రూ. 2.50 కోట్లు ఇప్పటికే రైతుల ఖాతాలు జమ అయిన సంగతి తెలిసిందే అన్నారు. తాజాగా ఇప్పుడు మార్చి 17 వరకు కందులు అమ్ముకున్న రైతుల డబ్బులు 10 కోట్లు వారి ఖాతాల్లో జమకానున్నట్లు వెల్లడించారు.

## ప్రతి ఇంటికీ శుద్ధి జలం అందాల్సిందే : కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 15(డీడీ9 వార్త):**

జిల్లాలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం భీంగల్ మండల పరిషత్ కార్యాలయంలో బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈలు, ఎంపీఓలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఏ ఒక్క గ్రామంలోనూ నీటి ఎద్దడి రాకూడదు. అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి. చేతి పంపులు, బోరు బావులను తనిఖీ చేసి, వెంటనే ఫ్లషింగ్ చేయించాలని ఆదేశించారు. జూన్ నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నందున హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా శుద్ధి చేసిన జలాలు అందాలని, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని స్పష్టం చేశారు.

**నమూనా పాఠశాలగా తీర్చిదిద్దాలి:**

అనంతరం భీంగల్ మండలం గోన్‌గొప్పుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణను కలెక్టర్ సందర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి అనువైన పరిస్థితులను పరిశీలించారు. ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, కంప్యూటర్ గదులు, ఆర్.ఓ ప్లాంట్ వంటి వసతులతో సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ రాజేందర్, డీపీఓ శ్రీనివాస్ రావు, మిషన్ భగీరథ ఈఈ రాకేష్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ఇస్కాన్ ఆలయంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక చైతన్యం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 15(డీడీ9 వార్త):**

బోధన్ పట్టణంలోని ఇస్కాన్ దేవాలయం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. కొత్త బస్టాండ్ ఎదురుగా కొలువైన ఈ ఆలయంలో 'హరే కృష్ణ హరే రామ' కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏటా ఆనవాయితీగా సాగే ఈ ఆధ్యాత్మిక శిబిరానికి ఈసారి కూడా భక్తులు పోటెత్తడంతో ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. విద్యార్థులకు భగవద్గీతలోని విశిష్టతను, భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లోని పరమార్థాన్ని ఇస్కాన్ సభ్యులు కళ్ళకు కట్టినట్లు వివరించారు. కేవలం భక్తికే పరిమితం కాకుండా, సమాజంలో విలువలతో కూడిన జీవనం ఎలా సాగించాలి, తల్లిదండ్రులను గౌరవించే సంస్కారాన్ని ఎలా అలవర్చుకోవాలి అనే అంశాలపై ప్రముఖులు చేసిన ప్రసంగాలు అందరినీ ఆలోచింపజేశాయి. ఈ ఆధ్యాత్మిక వేడుకలో స్థానిక పాఠశాలలైన ఇందూరు మోడల్, మాతృశ్రీ, చందూర్ విక్టరీ, వర్ని మ్యాట్రిక్స్, వంశీ, అంతోని స్కూళ్ల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు. పిల్లలకు ఆధ్యాత్మికతపై ఆసక్తి కలిగేలా ఇస్కాన్ ప్రతినిధులు వినూత్నంగా ఆటపాటలు, శిక్షణా తరగతులను నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అశోక్, నితాయి దాస్, కేశవ కరుణానిధి దాస్, నిత్య రూప నరహరి దాస్ వంటి ప్రముఖులు భక్తులకు దిశానిర్దేశం చేశారు. ఉదయం నుంచి సాగిన హరినామ సంకీర్తనలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తగా అనంతరం అన్నప్రసాద వితరణతో చేపట్టారు. సాయంత్రం అల్పాహార విందుతో ముగిసిన ఈ కార్యక్రమం పట్టణ ప్రజల్లో నూతన ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది.



DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
గురువారం
16-04-2026
హైదరాబాద్



## ఎనిమిదో రోజుకు చేరిన విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 15(డీడీ9 వార్త):**

తెలంగాణ విద్యావంతులైన ఆర్టిజన్ల జె.ఎ.సి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మె ఎనిమిదో రోజుకు చేరింది. బుధవారం నిజామాబాద్ సర్కిల్ కార్యాలయం ముందు డిచ్‌పల్లి, నిజామాబాద్ డివిజన్లతో పాటు ట్రాన్స్‌కోకు చెందిన వందలాది మంది ఆర్టిజన్ కార్మికులు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి, యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సమాన పనికి.. సమాన వేతనం

ఈ సందర్భంగా జె.ఎ.సి నాయకులు మాట్లాడుతూ.. ఒకే సంస్థలో అందరికీ ఒకే రూల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల విద్యార్హతలను బట్టి కన్వర్షన్ ప్రక్రియ చేపట్టాలని, పీస్ రేట్ వర్కర్లు, అన్‌మ్యాన్డ్ వర్కర్లు మరియు మీటర్ రీడర్లను ఆర్టిజన్లుగా గుర్తించి సంస్థలో విలీనం చేయాలని కోరారు. జీవో నంబర్ 11 ప్రకారం ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలు కల్పిస్తూ కనీస వేతనాన్ని ప్రకటించాలని వారు స్పష్టం చేశారు.

**పెరుగుతున్న మద్దతు**

ఆర్టిజన్ల పోరాటానికి 1104 యూనియన్ డిస్కమ్ ప్రెసిడెంట్ రఘునందన్ పూర్తి మద్దతు ప్రకటించారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, సుమారు 500 మందికి పైగా కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేశారు. డిమాండ్లు నెరవేరని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.




## ఎస్. ఐ, సీ ఐ లను మర్యాద పూర్వకంగా కలిసినా ప్రముఖులు

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్, ఏప్రిల్ 15(డి డి 9 వార్త ):-**

ఆదిలాబాద్ జిల్లా లోని బోథ్ మండలం లోని ప్రముఖులు బోథ్ ఎస్ ఐ పురుషోత్తం, సీ ఐ గురుస్వామి నీ కలిసి వారికీ భగవత్ గీత పుస్తకన్ని అందించారు. ప్రజలలో శాంతి తాత్వాన్ని. ఆధ్యాత్మిక సామజిక సేవ సమాజం పై నిబద్దతగా మెలిగే విధంగా భగవత్ గీత ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు మునిగేలా శ్రీధర్, జాదవ్ ప్రవీణ్ కలిసి భగవత్ గీత పారాయణం పుస్తకాన్ని అందించారు.




## పదవులు కష్టానికి పైరవీలకు కాదు

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్, ఏప్రిల్ 15(డి డి 9వార్త )**



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నరేష్ జాధవ్‌ను కలిసి మండలంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ నిర్మాణం, కార్యకర్తల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి అవసరమైన అంశాలను వివరించి వినతి పత్రం సమర్పించారు. పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని వారు గట్టిగా కోరారు. స్థానిక పరిస్థితులు బాగా తెలిసిన నాయకులు, కష్టపడే కార్యకర్తల సూచనలతో నిర్ణయాలు తీసుకుంటే పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో, ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. కష్టపడిన వారికే పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వడం ద్వారా కార్యకర్తల్లో నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. పార్టీకి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకే అవకాశాలు కల్పించాలని, పైరవీలు, వ్యక్తిగత అనుబంధాల ఆధారంగా పదవులు ఇవ్వడం పార్టీకి నష్టం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. కాడర్‌ను గౌరవించి ప్రోత్సహించడం ద్వారానే పార్టీ బలోపేతం సాధ్యమని తెలిపారు.అలాగే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడిని కోరారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.పార్టీ కోసం ఐక్యతతో, క్రమశిక్షణతో పనిచేయాలని, వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమనే భావనతో ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశం ద్వారా మండల సమస్యలు డీసీసీ అధ్యక్షుడి దృష్టికి వెళ్లాయని, త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ బ్లాక్ ప్రెసిడెంట్ మెరుగు నరసింహ దాస్, మాజీ ఎంపిటిసి మహేందర్, మాజీ ఎంపిటిసి & ప్యాక్స్ డైరెక్టర్ చట్ల ఉమేష్, డీసీసీ జనరల్ సెక్రటరీ ఆత్రం సుశీల, సెక్రటరీ వినయ్ రెడ్డి, కుచ్లాపూర్ సర్పంచ్ నారాయణ, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు బోజన్న, సాయన్న, ఆత్మ డైరెక్టర్ రహీం, మార్కెట్ డైరెక్టర్ అబ్రార్, సురేందర్, ఉప సర్పంచ్ రమేష్, పోతా రెడ్డి, దినేష్ రెడ్డి, షామిందర్ రెడ్డి, అలపాటి అచ్యుతానంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నియమాలు పాటిద్దాం.. క్షేమంగా వెళదాం : సీఐ విజయ్ బాబూ





- **ట్రాఫిక్ రూల్స్‌పై సాలూర విద్యార్థుల ప్రతిజ్ఞ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 15(డీడీ9 వార్త):**

రహదారి నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యతని, క్రమశిక్షణతో కూడిన ప్రయాణమే ప్రాణాలకు రక్షణ కవచమని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు పేర్కొన్నారు. బుధవారం సాలూర మండల కేంద్రంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన రహదారి భద్రతా అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలకు తీరని లోటని, విద్యార్థులు చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి కనీస జాగ్రత్తలను అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి రహదారి నిబంధనలు పాటిస్తాం ప్రమాదాలను నివారిస్తాం అంటూ ఆయన ప్రతిజ్ఞ చేయించారు. చిన్నతనం నుంచే సామాజిక స్పృహ పెంపొందించుకోవాలని, తమ ఇంట్లోని పెద్దలకు కూడా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అరైవ్ అలైవ్ నినాదంతో సాగిన ఈ కార్యక్రమంలో ఎస్సై మచ్చేందర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, పాఠశాల విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## చిన్న రైతుల పట్ల వివక్ష

- **పోతంగల్ సొసైటీ వారు చిన్న రైతుల పట్ల పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారు**

**నిజామాబాద్ పోతంగల్ మండల్ /ఏప్రిల్15(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని సొసైటీ వారు చిన్నా రైతుల పట్ల పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని అంతే కాకుండా కక్ష సాధింపులు చేస్తున్నారని అదేమిటని ప్రశ్నిస్తే నిర్లక్ష్య ధోరణితో సమాధానం చెబుతూ ఈసడించి రైతుల పట్ల మాట్లాడడం చాలా దారుణంగా ఉందని రైతులు అంటున్నారు. చిన్న రైతులంటేే చిన్నచూపు చూడడమే కాకుండా అత్యంత దారుణంగా తమ పట్ల వ్యవహ రిస్తున్నారని ఇంత దారుణం చేయడం చాలా అవివేకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. తమ ధాన్యం కాటా చేయడం పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని కొంతమంది పెద్ద రైతులకు వత్తాసు పలుకుతున్నారని చిన్న రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బార్ధన్ కూడా సరిగా ఇవ్వడం లేదని ఇతర సౌకర్యాలు సరిగా కల్పించడం లేదని తమ ధాన్యం కొనుగోలు చేయడంలో చాలా నిర్లక్ష్యం చేయడమే కాకుండా వివక్ష చూపడం చాలా దారుణంగా ఉందని రైతులు అంటున్నారు. తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు పోతంగల్ సొసైటీ వారిపై చర్యలు తీసుకొని తమకు అనగా చిన్న రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు , సాయిలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## రహదారి భద్రత అవగాహన కార్యక్రమం

- **కోటగిరి ఎస్సై సునీల్**

**నిజామాబాద్ కోటగిరి ఏప్రిల్ 15 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలను దానిపై ప్రాముఖ్యతను వివరించడం జరిగింది ఎస్సై సునీల్ వారు మాట్లాడుతూ .అరైవ్ అలైవ్' అనే పేరుతో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మైనర్ రాంగ్ రూట్ డ్రైవింగ్. డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ప్రమాదాల బారిన పడకుండా అవగాహన కల్పించడం జరిగింది. బస్టాండ్ ఆవరణలో విద్యార్థులు అవగాహన కల్పించేందుకు మానవ గోలుసుగా ఏర్పడి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు మరణాలు తగ్గించడం దీని ముఖ్య లక్ష్యం అని ఎస్ఐ సునీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు కోటగిరి ఎస్సై సునీల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- **గడువులోగా స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి**
- **అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ఆదేశం**

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 15(డీడీ9 వార్త):**


జిల్లాలో స్కానింగ్ సెంటర్ల నిర్వహణ నిబంధనల ప్రకారం జరగాలని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి భ్రూణ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ కె.ఎస్.కిరణ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం తన ఛాంబర్‌లో జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల కొత్త రిజిస్ట్రేషన్లు, పునరుద్ధరణ దరఖాస్తులను పరిశీలించారు.

గడువు దాటితే అనుమతులు రద్దు

స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తమ రిజిస్ట్రేషన్ గడువు ముగియకముందే పునరుద్ధరణ చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సెంటర్ల అనుమతులను రద్దు చేయడమే కాకుండా, వాటిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సెంటర్ల నిర్వాహకులకు చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

నిఘా పెంచాలి : జిల్లా వైద్యాధికారిణి

జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ.. స్కానింగ్ సందర్భంగా ఎలాంటి అక్రమాలకు తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కొత్తగా వచ్చిన 3 దరఖాస్తులను, రిజిస్ట్రేషన్ పునరుద్ధరణకు సంబంధించి 2 దరఖాస్తులను కమిటీ ఆమోదించింది. నిబంధనలు పాటించని ఒక సెంటర్‌ను మూసివేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పి.ఎన్.డి.టి నోడల్ అధికారి డా .ప్రతాప్, ఎం.సి.హెచ్ అధికారి డా.ప్రతిభ, పోలీస్ స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్‌స్పెక్టర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## ఆపదలో ఉన్న వారికి అండగా నేనున్న అని ముందుకు వస్తున్న సితాలె రమేష్

**నిజామాబాద్ కోటగిరి ఏప్రిల్ 15 (డిడి9 వార్త):**


నిజామాబాద్ కోటగిరి వారం క్రితం MD ఆసిఫ్ అనే యువకుడికి బీర్కూర్, తిమ్మాపూర్ మధ్యలో యాక్సిడెంట్ అయి నిజామాబాద్ ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు, వారి పరిస్థితి బాగాలేదు అని అబ్దుల్ నయీం అనే వ్యక్తి రమేష్ అన్నకి చెప్పగానే రమేష్ అన్న తన వాట్సాప్ స్టేటస్ ద్వారా 14,500 రూపాయలు జమచేసి ఈరోజు ఆసిఫ్ ఇంటికి వెళ్లి ఇచ్చి వారి కుటుంబానికి ధైర్యం చెప్పడం జరిగింది. ఇట్టి సేవా కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అధ్యక్షులు సితలే రమేష్, గ్రామ యువకులు అబ్దుల్ నయీం,భరత్, శ్యామ్ శ్రీకాంత్,నిఖిల్, ప్రవీణ్,ఆసిఫ్, పాల్గొన్నారు,



# రామ్‌చరణ్ 'పెద్ది'.. మరోసారి వాయిదా

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న 'పెద్ది' మరోసారి వాయిదా పడింది. సోషల్ మీడియా వేదికగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఏప్రిల్ 30న రిలీజ్ కావాల్సిన ఈ చిత్రాన్ని జూన్‌కు పోస్ట్‌పోన్ చేసింది. కొత్త విడుదల తేదీని అతి త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. ''పెద్ది' సాంగ్స్, గ్లింప్స్‌పై మీ ఆదరణకు ధన్యవాదాలు. టాకీ పార్ట్ షూటింగ్ పూర్తయింది. ఒక్క పాట షూటింగ్ మిగిలి ఉంది. అవుట్‌పుట్‌తో సంతోషంగా ఉన్నాం. ఇంత గొప్ప కంటెంట్ మా చేతిలో ఉంది కాబట్టి.. దానిని మరింత బాగా ప్రెజెంట్ చేయాలనుకుంటున్నాం. అందుకే పోస్ట్ ప్రొడక్షన్స్ వర్క్‌కు సంబంధించి సాంకేతిక నిపుణులకు మరికొంత సమయం ఇవ్వడం ముఖ్యం అనుకున్నాం. మీకు బెస్ట్ థియేట్రికల్ అనుభూతి ఇవ్వడం మా బాధ్యత. దీనిని దృష్టిలో పెట్టుకుని వాయిదా వేశాం'' అని 'పెద్ది' టీమ్ వివరించింది.

మార్చిలోనే రావాల్సిన ఈ మూవీ ఇంతకుముందు ఈనెల 30కు వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీ కపూర్ హీరోయిన్ కాగా.. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ, జగపతి బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు.



# వరుస సినిమాలతో రాషా జోరు..

తెలుగులో మెంటల్ మదిలో, చిత్రలహరి వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ ఇప్పుడు మళ్లీ వార్తల్లో నిలిచింది. ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా ఉన్న ఈ నటి, తన వ్యక్తిగత కారణాల వల్ల సినిమాలకు కాస్త విరామం ఇచ్చింది. అయితే, ఇప్పుడు ఆమె మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నివేదా తన కెరీర్ జోరుగా సాగుతున్న సమయంలోనే బిజినెస్ మెన్ రజిత్ ఇబ్రాన్‌తో ప్రేమలో పడింది. అతనితో జీవితాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్న ఆమె, 2023లో సినిమాలకు దూరం అయింది. అంతేకాకుండా తన ప్రియుడితో క్లోజ్‌గా దిగిన ఫొటోలను షేర్ చేస్తూ.. కాబోయే భర్తను పరిచయం చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక పెళ్లి బంధంతో ఒక్కటికాబోతున్నట్లు కూడా హింట్ ఇచ్చేసింది. దీంతో అంతా పెళ్లి చేసుకుని సెటిల్ అయిపోతుందని భావించారు. ఈక్రమంలోనే.. విధి వైపరీత్యం వల్ల వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుండి ప్రియుడితో ఉన్న ఫోటోలన్నీ తొలగించి బ్రేకప్‌పై అందరికీ హింట్ ఇచ్చేసింది. తాజాగా రజిత్ మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకోవడంతో, నివేదా తన గతాన్ని వదిలేసి మళ్లీ కెరీర్ మీద దృష్టి పెట్టిందట. ప్రస్తుతం నివేదా మళ్లీ వెండితెరపై మెరవాలని ఆరాటపడుతోంది.



# లేటౌతున్న ఆలియా మూవీస్..

ఆలియా భట్ పేరుకు స్టార్ కిడ్ అయినప్పటికీ తనకంటూ ఓన్ ఐడెంటిటీని క్రియేట్ చేసుకుని సక్సెస్ అయ్యింది. డిఫరెంట్ మూవీస్ చేస్తూ బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక పెళ్లయ్యాక సెలక్టివ్ సబ్జెక్ట్స్ చేస్తోన్న ఆలియా లాస్ట్ ఫిల్మ్ జిగ్రా బాక్సాఫీస్ దగ్గర తేడా కొట్టింది. ఈ లెక్క సరిచేయడానికి నెక్ట్స్ హైఆక్టేన్ మూవీస్ సిద్ధం చేస్తోంది. యశ్ రాజ్ ఫిల్మ్ స్పై యూనివర్శ్‌లో తెరకెక్కుతోన్న ఆల్ఫా గత ఏడాదే రావాల్సి ఉంది.. కానీ వార్2 రిజల్ట్ చూసిన యశ్ రాజ్ ఫిల్మ్స్ .. ఈ సినిమా విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రజెంట్ ఈ సినిమా చివరి దశకు చేరుకుందని సమాచారం. ఆల్ఫానే కాదు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న లవ్ అండ్ వార్ సెట్‌స్‌పై ఉంది. రణబీర్, విక్కీ కౌశల్, ఆలియా నటిస్తున్న ఈ మూవీ షూటింగ్ ఇంకా కంప్లీట్ కాలేదు. ఈ ఏడాది మార్చిలో రావాల్సిన ఈ మూవీలోని కీలక సన్నివేశాలు తెరకెక్కించాలట. జూన్ నాటికి షూట్ పూర్తి చేయనున్నారు. అత్యంత పకడ్బందీగా.. ఒక్క సీన్ కాదు కదా ఒక్క పీక్ లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు భన్సాలీ. భారీ వీఎఫ్ఎక్స్ వర్క్ ఉన్న కారణంగా చాలా టైం పడుతుందని తెలుస్తోంది. దీంతో ఈ ఏడాది ఈ సినిమా రానట్లే అంటోంది బీటౌన్ మీడియా. ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్స్‌కు బోలెడు టైం పట్టేస్తుండటంతో ఇవే జోనర్ బోర్ కొట్టిన ఆలియా.. నెక్ట్స్ సింపుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌కు సిద్ధం చేస్తోంది. దృశ్యం2 ఫేం అభిషేక్ పాఠక్‌తో హౌస్ వైఫ్ అనే మూవీ చేస్తున్నట్లు తెలుస్తోంది. రాజ్ కుమార్ రావ్‌ని హీరోగా కన్సిడర్ చేస్తున్నారని బీటౌన్‌లో వినిపిస్తున్న మాట. ఇక ట్రిబుల్ ఆర్ తర్వాత టాలీవుడ్‌కు గ్యాప్ ఇచ్చేసింది సీత. నాగ్ అశ్విన్‌తో ఓ మూవీ చేయబోతోందని రూమర్స్ రాగా, అవి గాసిప్స్ వరకే పరిమితమయ్యాయి. కానీ తాజాగా ఓ ఇంట్రస్టింగ్ బజ్ వినిపిస్తోంది. తారక్ ప్రశాంత్ నీల్ మూవీ డ్రాగన్‌లో ఓ కీ రోల్ చేయబోతోందట ఆలియా. బాలీవుడ్ మార్కెట్ కొల్లగొట్టేందుకు ఆమెను తీసుకొస్తున్నట్లు సమాచారం.



# 'టాక్సిక్' కోసం మేకర్స్ మాస్టర్ ప్లాన్..
# అంచనాలు పెంచే ప్రయత్నం

కన్నడ స్టార్ హీరో యష్ తాజాగా టాక్సిక్ అనే చిత్రంలో హీరోగా నటించిన విషయం మనకు తెలిసిందే. ఈ సినిమాను మార్చి 19న విడుదల చేయనున్నట్లు మేకర్స్ మొదట ప్రకటించారు. అందుకు అనుగుణంగా కొన్ని ప్రచార చిత్రాలను కూడా విడుదల చేశారు. అయితే ఆ తర్వాత సడన్‌గా ఈ చిత్రాన్ని పోస్ట్‌పోన్ చేశారు. ప్రస్తుతం జూన్ 4వ తేదీన ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా నుండి ఇప్పటికే మేకర్స్ కొన్ని ప్రచార చిత్రాలను విడుదల చేశారు. వాటితో ఈ మూవీపై మంచి హైప్ క్రియేట్ అయింది. ఆ అంచనాలు మరింత పెంచే ప్లాన్ ఒకటి మేకర్స్ వేసినట్లు తెలుస్తోంది. ఈ మూవీ బృందం ఈ సినిమా విడుదల తేదీలోపు మరో టీజర్‌ను విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

ఆ టీజర్‌లో యష్‌తో పాటు ఈ సినిమా హీరోయిన్ కియారా అద్వానీ కూడా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ టీజర్ గనుక ప్రేక్షకులను ఆకట్టుకుంటే, ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగే అవకాశం చాలా వరకు ఉంది. ఇకపోతే గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, టోవినో థామస్, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారి, డారెల్ డిసిల్వా, నటాలి బర్న్, కైల్ పాల్, బాలాజీ మనోహర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ మరియు యష్ సొంత నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.



# సినిమాలు చేస్తున్న సమయంలో కొన్నిసార్లు నాకు పిచ్చేక్కిపోయేది..

టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల కేవలం డ్యాన్స్‌తోనే కాదు, తన పట్టుదలతో కూడా అందరినీ మెప్పించింది. క్రేజీ హీరోయిన్‌గా వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, అత్యంత కష్టమైన MBBS పూర్తి చేసి డాక్టర్ పట్టా పుచ్చుకోవడం గమనర్హం. అయినప్పటికీ బాక్సాఫీసు వద్ద తన సత్తా చాటేందుకు గత కొద్ది కాలంగా హిట్ కోసం తాపత్రయపడుతున్న శ్రీలీల ఇటీవల 'ఉస్తాద్ భగత్ సింగ్' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ ఈ చిత్రం భారీ అంచనాల మధ్య వచ్చి నెగెటివ్ టాక్‌ను రాబట్టుకుంది. దీంతో శ్రీలీల కెరీర్ డేంజర్‌లో పడింది. ఆమె నటిస్తున్న చిత్రాలన్నీ ఫ్లాప్ అవుతుండటంతో.. ఐరన్ లెగ్ అనే ముద్ర పడింది. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ భామ 'డాక్టర్ టు యాక్టర్' జర్నీ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. సినిమా గ్లామర్ ప్రపంచాన్ని, మెడిసిన్ లాంటి సీరియస్ చదువును ఎలా మేనేజ్ చేశావని యాంకర్ ప్రశ్నించగా.. శ్రీలీల తన సక్సెస్ సీక్రెట్ చెప్పింది. "ఈ ప్రయాణంలో సంకల్పం, సహనం చాలా ముఖ్యం. షూటింగ్‌లో ఉన్నప్పుడు నటిగా, ఇంటికి రాగానే విద్యార్థిగా మనసును మార్చుకోవడం నేర్చుకున్నాను. అప్పుడే రెండిటికీ న్యాయం చేయగలం" అని వివరించింది. ప్రయాణం అంత సులభంగా సాగలేదని శ్రీలీల నిజాయితీగా ఒప్పుకుంది. "కొన్ని రోజులైతే షూటింగ్ ఒత్తిడి, చదువు భారం చూసి నాకు పిచ్చెక్కిపోతుందేమో అనిపించేది. పగలు కెమెరా ముందు బిజీగా ఉండి, రాత్రి ఇంటికి రాగానే మళ్ళీ పుస్తకాలు తీయాల్సి వచ్చేది. కానీ ఆ ఒత్తిడిని కూడా నేను ఆస్వాదించాను. ఆ కష్టమే నాకు ఒక లక్ష్యాన్ని, తృప్తిని ఇచ్చింది" అని ఎమోషనల్ అయ్యింది. ఖాళీ సమయం దొరికితే చాలు చదువుకే కేటాయించేదాన్నని, మెడిసిన్ సబ్జెక్ట్ తనకు ఒక స్పష్టమైన గోల్‌ను ఇచ్చిందని శ్రీలీల పేర్కొంది. ప్రస్తుతం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో భారీ ప్రాజెక్టులు చేస్తున్న ఈ బ్యూటీ డాక్టర్‌గా, నటిగా తనదైన ముద్ర వేస్తోంది.



# షూటింగ్ స్టార్ట్ కాకముందే మల్టీస్టారర్ ఓటీటీ డీల్ క్లోజ్

ఇటీవల 'మన శంకర్ వరప్రసాద్' చిత్రంతో సంక్రాంతి స్పెషల్‌గా వచ్చి తన మార్క్ మరోసారి ప్రూవ్ చేసుకున్న డైరెక్టర్ అనిల్ రావిపూడి.. ఇప్పుడు భారీ మల్టీ స్టారర్ కథను సిద్ధం చేసిన విషయం తెలిసిందే. విక్టరీ వెంకటేష్ నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఇప్పటికే కృతి శెట్టి ఫిక్స్ కాగా.. కీర్తి సురేష్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం ఇంకా సెట్స్ మీదకు వెళ్లకముందే.. అప్పుడే ఓటీటీ డీల్ కంప్లీట్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

అనౌన్స్‌మెంట్ నుంచే ఈ క్రేజీ మల్టీ స్టారర్‌పై ఫ్యాన్స్ అండ్ ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ ఏర్పడింది. దీంతో షూటింగ్ మొదలవ్వకముందే ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ డీల్ కోసం పోటీ పడినట్లు టాక్. దీంతో ఎక్కువ మొత్తంలో ZEE5 ఈ సినిమా ఓటీటీ హక్కులను సొంతం చేసుకున్నట్లు తెలుస్తుంది. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానప్పటికీ సినిమా పూజ కూడా కాకముందే కోట్ల బిజినెస్ అంటే.. ఇది అనిల్ రావిపూడి బ్రాండ్ పవర్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు. కాగా.. ఈ చిత్రాన్ని కూడా సంక్రాంతి టార్గెట్‌గా చేసుకుని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్లాన్‌లో ఉన్నాడు మన డైరెక్టర్.



# మరింత ఆలస్యంగా 'మాతృభూమి'..




బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'మాతృభూమి'. ప్రకటించిన నాటి నుంచే వార్తల్లో నిలిచిన ఈ సినిమా మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రం విడుదల మరింత ఆలస్యం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కావాల్సి ఉంది. అయితే చిత్ర యూనిట్ దీన్ని ఇంకా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కు పంపలేదని సమాచారం. దీనివల్ల మే నెలలో కూడా ఈ సినిమా థియేటర్లలోకి రావడం కష్టమేనని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

దీనికి ప్రధాన కారణం సినిమాలో జరిగిన భారీ మార్పులేనని సమాచారం. భారత రక్షణ మంత్రిత్వశాఖ సూచనల మేరకు దర్శకుడు అపూర్వ లఖియా ఈ ప్రాజెక్టులో భారీస్థాయిలో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే దాదాపు 40శాతం సినిమాను రీషూట్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. సినిమా కథలో కొన్ని కల్పిత అంశాలను, రొమాంటిక్ సీన్లను, బ్యాక్‌స్టోరీని అదనంగా జోడించి కొత్త వెర్షన్‌ను సిద్ధం చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.
నేనెప్పుడూ ఆ విషయాన్ని నమ్ముతాను: రాజమౌళి
రక్షణ శాఖ అభ్యర్థన మేరకు సినిమాలో ఎక్కడా చైనా పేరును నేరుగా ప్రస్తావించకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతానికి రక్షణ మంత్రిత్వ శాఖ, ఆర్మీ, సెన్సార్ బోర్డ్ గానీ ఈ కొత్త వెర్షన్‌ను ఇంకా చూడలేదు. అన్ని అనుమతులు లభించిన తర్వాతే చిత్ర బృందం కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.